క్లుప్తంగా

రైల్వే స్థలంలో గోడ నిర్మించవద్దు



జీవీఎల్ నరసింహారావుకు వినతిపత్రం అందిస్తున్న గొర్లివానిపాలెం కాలనీ వాసులు

పెందుర్తి: పెందుర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే స్థలంలో ప్రహరీ నిర్మాణం వలన తమ కాలనీకి రాకపోకలు నిలిచిపోతాయని..ఆ నిర్మాణాన్ని నిలుపుదల చేసేలా సంబంధిత అధికారులతో చర్చించాలని జీవీఎంసీ 96వ వార్డు గొర్లివానిపాలెం కాలనీ వాసులు రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావును కోరారు. పెందుర్తి బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో శనివారం నగరంలో జీవీఎల్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. సమస్యపై రైల్వే అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని కాలనీ వాసులకు జీవీఎల్ భరోసా ఇచ్చారు.

సెప్టెంబరు 5న ఎన్టీపీసీ గుర్తింపు యూనియన్ ఎన్నికలు



ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న యూనియన్ నాయకులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో సెప్టెంబర్ 5న జరగనున్న నేపథ్యంలో శనివారం నామినేషన్లు స్వీకరించారు. ఐఎన్‌టీయూసీ మజ్దూర్ యూనియన్ తరపున జనరల్ సెక్రటరీగా బొండా భీమ్‌రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.జె.పి లెనిన్, కార్యవర్గ సభ్యులతో కలిసి ఎన్నికల అధికారి బీబీ పాత్ర (ఏజీఎం హెచ్ఆర్)కు నామినేషన్ పత్రాలను అందజేశారు.

ఘనంగా అప్పన్న తిరువీధి ఉత్సవం



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : సింహ సంక్రమణాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం సాయంత్రం తిరువీధి ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను పల్లకిలో వేంజింపజేశారు. సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా తిరువీధిలో ఏర్పాటు చేసిన తంగుడుబిల్లికి చెందిన శ్రీకృష్ణ కోలాట బృందం చేసిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన పురోహిత్ గొడవర్తి శ్రీనివాసాచార్యులు, సహాయ కార్యనిర్వాహణాధికారి ఆనంద్‌కుమార్, సూపరింటిండెంట్ పిల్లా శ్రీనివాస్, పీఆర్వో నాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చందనం అరగదీత

సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం కరాళ చందనం అరగదీతను చేపట్టారు. ఈనెల 19న సోమవారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఆరోజు తెల్లవారుజామున స్వామికి కరాళ చందనాన్ని సమరిస్తారు. అందుకు అవసరమైన సుమారు ఐదు కిలోల చందనాన్ని ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో ఆనంద్‌కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది అరగదీతను చేపట్టారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభిస్తున్న సుబ్బారావు

పరవాడ: ప్రతీ విద్యార్థి కంప్యూటర్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జేఎన్ ఫార్మాసిటీ ఉత్పత్తిదారుల సమైఖ్య కార్యదర్శి జెట్టి సుబ్బారావు పిలుపునిచ్చారు. రాంకీ ఫౌండేషన్ సహకారంతో ఫార్మాసిటీ పునరావాస కాలనీలో జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలో రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 8 కంప్యూటర్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల హెచ్ఎం అమ్మాజీ, ఫార్మాసిటీ ఎండీ లాల్‌కృష్ణ, జేఎస్‌పీసీ సమైఖ్య ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, కోశాధికారి శివప్రసాద్, ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్, ఏజీఎం రాఘవరెడ్డి, రవికుమార్, మహేంద్ర, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమార్కులకు ప్లానింగ్ సపోర్ట్

- జోన్–8లో అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్న టౌన్ ప్లానింగ్ విభాగం
- ప్లాన్ ఓ విధంగా.. నిర్మాణం మరోలా ఉన్నా పట్టించుకోని వైనం
- ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని అధికారులు



సుజాతనగర్



సుజాతనగర్ బీఆర్‌టీఎస్ రహదారికి సమీపంలో జీవీఎంసీ అధికారుల అండదండలతో అక్రమ నిర్మాణం

పెందుర్తి: మాకు ప్రభుత్వాదాయంతో పని లేదు.. మా 'జేబులు' నిండాయా లేదా అన్నట్టుంది జీవీఎంసీ జోన్–8 టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యవహారం.జోన్‌లో అక్రమ నిర్మాణాలకు ఆ విభాగం అధికారులు, సిబ్బంది తమవంతు సహకారం అందిస్తున్నారు. ఎక్కడికక్కడ తప్పుడు ప్లాన్‌లు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా కనీసం ప్రాథమిక విచారణ కూడా చేయడం లేదంటే టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరును అర్థం చేసుకోవచ్చు. ఎక్కడికక్కడే అక్రమ నిర్మాణదారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నా పట్టించుకోకుండా..కేవలం తమ జేబులు నింపుకోవడానికే 'ప్లాన్' చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు మీరినా.. పట్టించుకోరు

జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ బీఆర్‌టీఎస్ రహదారి సమీపంలో ఓ భారీ భవనం నిర్మాణం చేపట్టారు. అయితే దీనికి గ్రౌండ్ ఫ్లోర్‌లో సెల్లార్ విడిచిపెట్టి మూడు అంతస్తుల నిర్మాణం చేపడతామని టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అధికారికంగా అనుమతి తీసుకున్నారు. అయితే సదరు యజమానులు తీసుకున్న ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారు. కింది అంతస్తుతో పాటు అదనంగా మరో మూడు ఫ్లోర్ల నిర్మాణం చేపడుతున్నారు. దీనిపై ప్లానింగ్ అధికారులకు స్థానికులు అనేకసార్లు ఫిర్యాదులు చేశారు. అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు నిద్ర నటిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి అక్రమ నిర్మాణంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిశీలిస్తాం..

సుజాతనగర్‌లోని నిర్మాణంపై ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపడతాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– తేజ, టీపీవో, జోన్–8

ప్రశాంతంగా స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు



పెదముషిడివాడ: విజయం సాధించిన అధ్యక్ష, కార్యదర్శులతో సర్పంచ్ పల్లా నాగమణి



ఎన్నికైన వారితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ సత్యారావు



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికను పరిశీలిస్తున్న ఎంఈవో లక్ష్మణరావు



మల్లునాయుడుపాలెం జెడ్పీహెచ్ఎస్ చైర్మన్‌గా ఎన్నికైన సంతోష్‌ను అభినందిస్తున్న ఎంపీటీసీ కనకరాజు, వైఎస్సార్‌సీపీ నేత బోను గంగునాయుడు



ప్రమాణం చేస్తున్న నక్కా చిన్నారావు

పరవాడ: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలో 65 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 64 పాఠశాల కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. తానాం ప్రభుత్వ పాఠశాలలో పూర్తి స్థాయిలో ఓటర్లు లేని కారణంగా ఎన్నికలు నిర్వహించలేదని ఎంఈవో దివాకర్‌రావు చెప్పారు. ఎన్నికలను ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించారు. అనంతరం ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకొని ప్రమాణస్వీకారం చేయించారు. పెదముషిడివాడ జెడ్పీ పాఠశాల కమిటీ చైర్మన్‌గా బి.సింహాచలం, వైస్ చైర్మన్‌గా బి.గంగాదేవిలు ఎన్నికయ్యారు. ఎన్నికైన వీరిని సర్పంచ్ పల్లా నాగమణి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పల్లా అప్పారావు అభినందించారు. ముత్యాలమ్మపాలెం జెడ్పీ పాఠశాల కమిటీ చైర్మన్‌గా వి.నరేంద్ర, ఎ.కుమారిలను సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు అభినందించారు. పరవాడ బాలుర జెడ్పీ పాఠశాల కమిటీ చైర్మన్‌గా సీహెచ్.ఉమా, కె.శ్రీదేవి, వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాల కమిటీ చైర్మన్‌గా లెక్కల సన్యాసి, వైస్ చైర్మన్ టి.సంతోషికుమారిలు ఎన్నికయ్యారు.

ఏపీ బీసీ బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలలో..

సింహాచలం: అడవివరంలోని మహాత్మా జ్యోతీబా పూలే ఏపీ బీసీ బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలు విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో శనివారం ప్రశాంతంగా జరిగాయని ప్రిన్సిపాల్ దాసరి సత్యారావు తెలిపారు. ప్రతీ తరగతి నుంచి ఒక ఎస్సీ, ఒక బీసీ మహిళ, జనరల్ కేటగిరీలో ఒక మహిళను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిలో కె.శ్రీనివాసరావు చైర్మన్‌గా, ఐ.చిన్నారి వైస్ చైర్మన్‌గాను మిగిలిన 18మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు.

సబ్బవరం మండలంలో

సబ్బవరం: మండలంలో 54 ప్రభుత్వ పాఠశాలలకు గాను 51 పాఠశాలలో పాఠశాల నిర్వాహణ కమిటీల ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఎల్లుప్పి ఎంపీపీ పాఠశాల, పెద గొల్లలపాలెం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో ఎన్నికలు నిర్వహించలేదు. సబ్బవరం అగ్రహారంలో తల్లిదండ్రుల కోరం సరిపోవకపోవడంతో ఎన్నిక నిర్వహించలేదు. రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మెన్‌గా సబ్బవరపు కృష్ణ, మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ దనకోండ సంతోష్, తవ్వవానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా బోకం సత్తిబాబు, సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా జి.శంకరరావును,సబ్బవరం కేజీబీవీ చైర్మన్‌గా ఎం.త్రివేణి, సబ్బవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల చైర్మన్‌గా పిట్ల కనకరాజులను ఎన్నుకొన్నారు. అదేవిధంగా ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా మళ్ల యోగి, నంగినారపాడు జిల్లా ఉన్నత పాఠశాల చైర్మన్‌గా జి.శివశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

జుత్తాడ పాఠశాల చైర్మన్‌గా చిన్నారావు

పెందుర్తి: మండలంలోని జుత్తాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల యాజమాన్య కమిటీ చైర్మన్‌గా అక్కిరెడ్డిపాలెనికి చెంది నక్కా చిన్నారావు ఎన్నికయ్యారు. ఉత్కంఠ భరితంగా జరిగిన ఎన్నికల్లో చిన్నారావును పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. చిన్నారావుతో హెచ్ఎం సత్యకుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ చిన్నారావును పాఠశాల తల్లిదండ్రుల కమిటీ మాజీ చైర్మన్ పల్లా పద్మనాభం, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు సూర్యప్రకాష్, నక్కా మహేష్, అప్పికొండ శ్రీను, నక్కా అప్పారావు, ఎల్.రమణబాబు తదితరులు అభినందించారు.

విషాదం నింపిన.. పోలీసుల నిర్లక్ష్యం!

- సెల్ఫ్ యాక్సిడెంట్ ఘటనలో వ్యక్తి మృతి
- కుటుంబ సభ్యులకు కనీస సమాచారమివ్వని ఎంవీపీ పోలీసులు



యింటి వీరవెంకట సత్యనారాయణ(ఫైల్)

ఎంవీపీకాలనీ: యింటి వీర వెంకట సత్యనారాయణ అనే వ్యక్తి సెల్ఫ్ యాక్సిడెంట్ ఘటనలో ఎంవీపీ పోలీసులు వ్యవహరించిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యాక్సిడెంట్ అనంతరం కోమాలోకి వెళ్లిన సత్యనారాయణ రెండు రోజులుగా కేజీహెచ్‌లో మృత్యువుతో పోరాడి శనివారం మృతి చెందాడు. దీనిపై అతడి కుటుంబ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకపోవడం స్టేషన్ సిబ్బంది నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

ఘటనకు సంబంధించి వివరాలిలా.. యింటి వీరవెంకట సత్యనారాయణ తగరపువలసలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు కూతుళ్లతో కలిసి మద్దిలపాలెం కేఆర్ఎం కాలనీలో నివసిస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ రాత్రి భార్య ఫోన్ చేసి వరలక్ష్మీ వ్రతం సామగ్రి కావాలని చెప్పడంతో.. సత్యనారాయణ 15వ తేదీ తెల్లవారుజామున తన ద్విచక్ర వాహనంపై మిత్రుడిని పెదవాల్తేర్‌లో దింపేసి శివాజీపాలెం మీదుగా ఇంటికి బయలు దేరాడు. అప్పటికే మద్యం తాగి ఉండటంతో శివాజీ పార్కు వద్ద సెల్ఫ్ యాక్సిడెంట్‌కు గురయ్యాడు. అటుగా వెళ్తున్న రాపిడో బాయ్ పోలీసులకు సమాచారమివ్వడంతో అక్కడికి చేరుకున్న ఎంవీపీ పోలీసులు కేజీహెచ్‌కు తరలించి చేతులు దులిపేసుకున్నారు. తీవ్ర గాయాలపాలైన సత్యనారాయణ కోమాలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులకు కనీస సమాచారం అందించకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

మిస్సింగ్ కంప్లయింట్ ఇచ్చినా..

తన భర్త కనిపించడం లేదంటూ సత్యనారాయణ భార్య ఈ నెల 16న ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు కూడా నమోదు చేసిన పోలీసులు సత్యనారాయణ సెల్ఫ్ యాక్సిడెంట్‌పైనా, కేజీహెచ్‌లో కోమాలో ఉండటంపైనా ఆమెకు సమాచారం ఇవ్వకుండా అక్కడి నుంచి పంపించేశారు. సత్యనారాయణ కోసం గాలిస్తున్న కుటుంబ సభ్యులు ఎట్టకేలకు కేజీహెచ్‌లో అతడిని గుర్తించారు. రెండు రోజులుగా మృత్యువుతో పోరాడి చనిపోయినట్టు తెలియడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. శనివారం సాయంత్రం ఎంవీపీ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మృతుడి భార్య, కూతుళ్ల కన్నీటి పర్యంతమైన తీరు అందరినీ వేదనకు గురిచేసింది. పోలీసులు వ్యవహరించిన తీరు అమానవీయమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

సందడిగా చిల్డ్రన్ పార్కు



సందర్శకులతో కళగా కనిపిస్తున్న గుల్లలపాలెం చిల్డ్రన్ పార్కు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలోని చిల్డ్రన్ పార్కు శనివారం సాయంత్రం జనంతో కిటకిటలాడింది. ఇక్కడ అందమైన పరిసరాలు, చిన్నారులు ఆడుకోవడానికి అనేక ఆట పరికరాలు ఉండటంతో చాలా మంది కుటుంబ సభ్యులతో కలిసి పార్కుకు వచ్చి తమ పిల్లలతో సరదాగా గడుపుతున్నారు. పెద్దలు వాకింగ్ చేస్తూ ఇక్కడ సేద తీరుతూ పార్కు అందాలను ఆహ్వాదిస్తున్నారు. ప్రతి శని, ఆదివారాల్లో చిల్డ్రన్ పార్కు సందర్శకులతో సందడిగా కనిపిస్తుందని పార్కు కమిటీ ప్రతినిధులు తెలుపుతున్నారు.

ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ , బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు షీలానగర్‌లోని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ కోర్సులు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని రెండో అంతస్తులోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 28 ఏళ్లలోపు పురుషులు, మహిళలు అర్హులన్నారు. మూడు నెలల పాటు శిక్షణతో ఉచిత భోజన, వసతి, యూనిఫాం, బుక్స్, ఏసీ క్యాంపస్ వంటి సదుపాయాలు ఉంటాయని తెలిపారు. ఇంటర్ పాసైన యువతీ యువకులకు బీఎస్సీ, డిప్లమో పారామెడికల్ కోర్సులకు కూడా అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాలకు బొల్లినేని మెడ్‌స్కిల్స్, హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, ద్వారకానగర్, విశాఖపట్నం చిరునామాలో సంప్రదించాలని పేర్కొన్నారు. 7207953290, 7993011605 నంబర్లను కూడా సంప్రదించివచ్చునన్నారు.

వలంటీర్ మృతి బాధాకరం

సబ్బవరం: మండంలోని అసకపల్లి గ్రామానికి మాజీ వలంటీర్ ఈతలపాక కోటేశ్వరరావు అలియాస్ చంటి(25) ప్రజలకు అత్యున్నత సేవలు అందించారని ఆయన మృతి తీరని లోటని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గండి రవికుమార్ పేర్కొన్నారు. బాధిత కుంటుంబాన్ని ఆయన పరామర్శించంఆరు. కడుపు నొప్పి తాళలేక మృతి చెందడం బాధాకరమన్నారు. తక్షణ సాయం కింద సొంత నిధులు రూ.5 వేలు అందించారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలబోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. చాతుర్మాస దీక్షలో బాగంగా శ్రీరామాయణ హవనం నిర్వహించారు. అనంతరం శ్రీనివాసకల్యాణం, సీతారాముల కల్యాణంగా ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద, మజ్జిగ వితరణ చేపట్టారు.

వైద్యుల నిరసన



నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వద్ద నిరసన చేస్తున్న వైద్యులు, నర్సులు



పరవాడలో ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్య బృందం

సింహాచలం: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యకు నిరసనగా శనివారం నాయుడుతోట, మధురవాడ, మద్దిలపాలెం, గాజువాకలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రుల్లో వైద్యసేవలను నిలిపివేశారు. నాయుడుతోటలోని ప్రధాన ఆస్పత్రి వద్ద వైద్యులు, నర్సులు ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. బాధిత ట్రైనీ కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్, వైద్యులు రవీంద్ర, కృష్ణ, శిరీష, సుపర్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై దాడులు అరికట్టాలి

పరవాడ: కోల్‌కతాలో మెడికోపై లైంగిక దాడి, హత్యను నిరసిస్తూ పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది శనివారం భారీ ర్యాలీ చేపట్టారు. డాక్టర్ హారిక మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందించే వైద్యులకు, సిబ్బందికి రక్షణ కరువైందన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్య సంఘటన చాలా బాధాకరమన్నారు. ర్యాలీలో డాక్టర్ జయశ్రీ కరిష్మా, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ ఎం.ఎస్.ఎస్.సాయిరాం, జానకి రామన్, రాజేశ్వరి, సతీష్, పి.వి.రత్నం, విజయ్‌కుమారి, అన్నపూర్ణేశ్వరి, రత్నం, ఇందిరా, పి.వి.రాజు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, గోపాలపట్నం ఎస్ఐ అప్పలనాయుడు

సింహాచలం: మాదవ ద్రవ్యాల నిర్మూలనలో ఉపాధ్యాయులు కూడా తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సూచించారు. 98వవార్డు అడవివరం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని భీమిలి నియోజకర్గంలో పనిచేస్తున్న బయాలజీ,వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం 98వవార్డు పరిధి అడవిరంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం జరిగింది. ఈకార్యక్రమంలో పాల్గొన్న డీఈవో ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. మత్తు పదార్థాలకు యువత బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్న పరిస్థితులు కళ్లారా చూస్తున్నామన్నారు. విద్యార్థులు వాటి జోలికి వెళ్లకుండా ఉపాధ్యాయులు కూడా ఎప్పటికప్పుడు గమనిస్తుండాలన్నారు. పోలీసు శాఖకు ఉపాధ్యాయులు కూడా సహకరించాలని కోరారు. గోపాలపట్నం ఎస్ఐ అప్పల నాయుడు మాట్లాడుతూ సమాజాభివృద్ధికి, ప్రశాంతమైన జీవితానికి మాదకద్రవ్యాలు అడ్డంకుగా మారాయన్నారు. విద్యార్థులు ఇటీవల కాలంలో వ్యవసనాలకు బానిసవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులంతా పాఠశాల ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు సీహెచ్.రవికుమార్, పి.రాము, లలిత్‌కుమార్, రామచంద్రనాయుడు, శేషబాబు పాల్గొన్నారు.

అటల్ మారథాన్ విజేతలకు సత్కారం



ట్రైనీ ఉపాధ్యాయిని భానుమతిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సత్యారావు



జ్ఞాపికలతో విద్యార్థులు

సింహాచలం: అటల్ మారథాన్ పోటీల్లో జాతీయ స్థాయిలో సత్తా చాటి ఈనెల 15న ఢిల్లీలో జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగి సింహచలం చేరుకున్న అడవివరంలోని మహాత్మా జ్యోతీబా పూలే ఏపీ బీసీ బాలుర సంక్షేమ గురుకుల పాఠశాల ట్రైనీ ఉపాధ్యాయిని కంపర భానుమతి, విద్యార్థులు సోమశేఖర్, గణేష్, లజపతిరాయిలను శనివారం పాఠశాలలో ప్రిన్సిపాల్ దాసరి సత్యారావు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న నీతి అయోగ్ సంస్థ అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే దిశగా అటల్ టింకరింగ్ లేబరేటరీలు ఏర్పాటు చేసిందన్నారు. 2023–24 సంవత్సరంలో జరిగిన పోటీల్లో దేశవ్యాప్తంగా అనేక పాఠశాలల నుంచి పలు నమూనాలతో విద్యార్థులు హాజరవ్వగా సింహాచలం బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు తయారుచేసిన గ్రీన్ హౌస్ మోనటరింగ్ కంట్రోల్ సిస్టం ప్రాజెక్టు జాతీయస్థాయిలో మొదటి 100 స్థానాల్లో స్థానం దక్కించుకుందన్నారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంపికై ఏకైక ప్రాజెక్ట్ కూడా ఇదే అన్నారు. దీంతో జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్, గైడ్ ఉపాధ్యాయని కె.భానుమతితో పాటు ముగ్గురు విద్యార్థులను ఈనెల 15న ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆహ్వానించి ఘనంగా సత్కరించారన్నారు. విద్యార్థుల ప్రాజెక్ట్ రూపొందించడానికి పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబే ముఖ్య కారణమన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



సంతోష్‌కుమార్ మృతదేహం

పరవాడ: మండలంలో గొర్లివానిపాలెం జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్న వై.సంతోష్‌కుమార్ (38) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పరవాడ సీఐ ఎస్.బాలసూర్యా రావు అందించిన వివరాలిలా ఉన్నాయి...పరవాడ ఫార్మాసిటీలో బయోకాన్ పరిశ్రమలో సెక్యూర్టీ గార్డుగా పని చేస్తున్న సంతోష్‌కుమార్ అనకాపల్లికి చెందిన వాణిని 13 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వరలక్ష్మి వ్రతం నిమిత్తం వాణి ఆమె కన్నవారింటికి శుక్రవారం వెళ్లింది. శనివారం ఉదయం భర్త సంతోష్‌కుమార్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. ఎదురింట్లో ఉన్న వారికి ఫోన్ చేసి తన భర్త ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు..ఇంటికి వెళ్లి ఒకసారి చూడమని కోరింది. దీంతో సంతోష్‌కుమార్ ఉంటున్న ఇంటికి వెళ్లి కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెంది ఉండడాన్ని గుర్తించి వాణికి విషయం చెప్పారు. మృతుడి తండ్రి కృష్ణారావు ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు వెల్లడించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పరవాడ: మండలంలో కలపాక శివారు మూలస్వయంభూవరం వద్ద శుక్రవారం రాత్రి బొగ్గు లారీ మినీ వ్యానును ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. పెదగంట్యాడ మండలం దాసరిపేటకు చెందిన ధర్మాల ఎల్లాజిరెడ్డి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందగా, కర్రి జనార్ధన్‌రెడ్డి, డి.అనిల్‌కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారని పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు. శుక్రవారం రాత్రి మూలస్వయంభూవరం నుంచి కలపాక వైపు వస్తున్న మినీ వ్యానును హిందూజా పరిశ్రమకు బొగ్గు లోడుతో వెళుతున్న లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మినీ వ్యాను దెబ్బతినగా అందులో ప్రయాణిస్తున్న వ్యాను డ్రైవర్ ఎల్లాజిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వారిని కేజీహెచ్‌కు తరలించామని చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని చెప్పారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాలసూర్యారావు చెప్పారు.